కథ

# ప్రేమ ఎంత మధురం

- గౌతమి

**'నిరీక్షణ కూడా ఎంత మధురం!' అన్నారెవరో?**
**నిజంగా నిరీక్షణ మధురమేనా? ఎంతకాలం నిరీక్షించగలం.. అటునుంచి స్పందన ఉండదని అనుకున్నాక కూడా నిరీక్షిస్తూ ఉండగలమా? స్పందన ఉండకపోతే నిరీక్షించి ఫలితమేమి? అయితే నా నిరీక్షణ నిష్ప్రయోజనమా? కాదు.. అవును.. అవును.. కాదు..!**
**ఔనా? కాదా?**
**ఎందుకు నిరీక్షిస్తున్నాను?**
**ఎవరి కోసం నిరీక్షిస్తున్నాను?**
**ఎంతకాలంగా నిరీక్షిస్తున్నాను?**

సతీష్.. అతని పేరు తలవగానే హృదయం ఉప్పొంగుతోంది. శరీరం మీది రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి.. అతని కోసం శరీరమంతా కళ్లై ఎదురు చూస్తోంది. కానీ అతను?

తమ మధ్య పరిచయమే తమాషాగా జరిగింది.

సతీష్ నేను పదో తరగతిలో క్లాస్‌మేట్స్‌మి. నేను అల్లరి ఎక్కువ. అబ్బాయిలకు నిక్‌నేమ్‌లు పెట్టేదాన్ని. చాలామంది అబ్బాయిలు నాతో మాట్లాడ్డానికే భయపడేవారు. అలాంటివారిలో సతీష్ కూడా ఒకడు. అలాంటి బుద్ధావతారాలను నేను అస్సలు పట్టించుకునేదాన్ని కాదు.

'చిల్డ్రన్స్ డే' ఇక వారం రోజులు ఉందనగా స్కూలు పిల్లలందరికీ ఆటల పోటీలు పెట్టారు. నేను వాగుడు కాయనే కానీ, ఆటల జోలికి పోయేదాన్ని కాదు. కిందపడి దెబ్బలు తగులుతాయని భయం. అయితే వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు, పాటల పోటీల్లో ముందుండేదాన్ని. ఆ ఏడాది జరిగిన పోటీల్లో ఆటల్లో చాలా వాటిల్లో సతీష్‌కు బహుమతులు వచ్చాయి. పాటల పోటీలో కూడా సతీష్‌కు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. నాకు సెకండ్ ప్రైజ్.

నాకు సంగీతం బాగా వచ్చని నమ్మకం ఎక్కువ. ఎక్కడ పాటల పోటీలు జరిగినా నేను పాల్గొనేదాన్ని. ఖచ్చితంగా నాకు ప్రథమ బహుమతి రావాల్సిందే. అయితే ఇప్పుడు ఈ బుద్ధావతారం సతీష్‌కు రావడంతో నాకు ఆశ్చర్యం, బాధ, అసూయ కలిగాయి. దగ్గరకెళ్లి ''కంగ్రాట్స్ సతీష్'' అన్నాను.

తను సిగ్గుపడుతూ ''థ్యాంక్స్'' అన్నాడు.

''ఇంత బాగా పాడేవాడివి మాటలు రానట్టు మౌనంగా ఉంటావే'' అన్నాను.

''నువ్వు మాట్లాడుతున్నావుగా'' అన్నాడు తలొంచుకునే.

అమ్మో.. వీడు సామాన్యుడు కాదు అనుకున్నాను. 'ఒరే సత్తిగా.. నీ పని తర్వాత చెప్తా' అనుకుని ''ప్రతి సంవత్సరం నాకే ఫస్ట్ ప్రైజ్ వచ్చేది'' అన్నాను బుంగమూతి పెట్టి.

''కావాలంటే తీసేసుకో'' అన్నాడు మెల్లగా తలెత్తి నవ్వుతూ.


''నాకేం నీ దయ అక్ఖర్లేదు. ఈసారి పోటీలో తప్పకుండా నాకే ఫస్ట్ ప్రైజ్ వస్తుంది'' అన్నాను.

''అలాగే.. నేను నీకే రావాలని ఆ భగవంతుని కోరుకుంటాను'' అన్నాడు సతీష్.

అప్పటినుంచీ మా మధ్య మాటలు పెరిగాయి. ఇద్దరికీ పాటల పిచ్చి. ఇద్దరం కలసి ఆదివారాలు, సాయంత్రాలు మ్యూజిక్ క్లాసులకు వెళ్లే వాళ్లం. పార్కుల్లో కూర్చుని సంగీత సాధన చేసే వాళ్లం. చదువులోనూ ఎప్పుడూ ముందుండే వాళ్లం.

రోజులు గడుస్తున్నాయి. మా మధ్య చనువు బాగా పెరిగింది. ఒకరంటే ఒకరికి ఇష్టమూ పెరిగింది. ఎంతలా అంటే ఒక్కరోజు ఒక్కరిని చూడకపోయినా ఇంకొకరు ఉండలేకపోయేంతగా!

టెన్త్ అయిపోయింది. ఇంటర్ అయిపోయింది. ఇంజనీరింగ్‌లో



చేరాం. లక్కీగా ఇద్దరికీ ఒకే కాలేజీలో సీటొచ్చింది. ఇద్దరిదీ ఒకే గ్రూపు. హాస్టల్స్ వేరు, ఉండేది ఒకేచోటే!

రోజూ ఉదయం తను నాకంటే ముందే రెడీ అయిపోయి మా హాస్టల్‌కు వచ్చేసేవాడు. నేను కూడా గంటముందే రెడీ అయిపోయేదాన్ని. ఇద్దరం వెళ్లి మా కాలేజీ గార్డెన్‌లో కూర్చొనే వాళ్లం. మా మధ్య సబ్జెక్ట్‌కు సంబంధించిన విషయాలతో పాటు మా క్లాస్‌మేట్స్ అల్లరి, సినిమాలు, సంగీతం, క్రీడలు, రాజకీయాలు.. ఇలా అన్ని విషయాలు దొర్లేవి.

కాలేజీ తరఫున అప్పుడప్పుడు పిక్నిక్‌లకు వెళ్లేవాళ్లం. సినిమాలకు కూడా వెళ్లేం. ఎక్కడికి వెళ్లినా మా ఇద్దరిదీ ఒక జట్టు. సతీష్ నాతో మాత్రమే జోవియల్‌గా ఉండేవాడు. మిగతా వారితో ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. చాలామంది మా ఇద్దరినీ లవర్స్ అనుకున్నారు. నిజానికి మా మధ్య అలాంటి ఫీలింగ్స్ లేవు. మా క్లాస్‌లో నేను అందగత్తెను. ఇది నా అభిప్రాయమే కాదు, క్లాస్‌మేట్స్ అభిప్రాయం కూడా. నా చూపుల కోసం, నా మాటల కోసం, నా నవ్వుకోసం, నా స్పర్శ కోసం నా వెంట చాలామందే పడ్డారు. అయినా నేను ఎవ్వరినీ పట్టించుకోలేదు. వాళ్లు నా వెంట పడుతోన్న కొద్దీ సతీష్ నాకు దగ్గరవుతూ వచ్చాడు. ఆ విషయాన్ని నేను మొదట్లో గమనించలేదు. ఆనాటి విషయాలన్నింటినీ గుర్తు చేసుకుంటే ఆ విషయం ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది.

నాకోసం పొద్దున్నే సతీష్ మా హాస్టల్‌కు రావడం ఎందుకు?

నా కోసం జోక్స్ పుస్తకాలు కొని చదివి, వాటిని నాకు చెప్పి నన్ను నవ్వించడం ఎందుకు?

నాకు తలనొప్పిగా ఉందని రాత్రి పదిగంటలకు ఫోన్ చేసినా, అప్పుడు సిటీకి పోయి టాబ్లెట్స్ తెచ్చి ఇవ్వడం ఎందుకు?

నాకు మార్కులు తగ్గి బాధపడుతుంటే తనూ బాధపడ్డం ఎందుకు?

నా వెంట అబ్బాయిలు పడుతుంటే వాళ్లతో గొడవ పడ్డం ఎందుకు?

ఇవన్నీ తలచుకుంటే సతీష్ నన్ను ప్రేమిస్తున్నాడనే సంగతి తెలుస్తుంది. అయితే అతనెప్పుడూ ఆ మాట చెప్పలేదు.

థర్డ్ ఇయర్‌లో ఉండగా నాకు పెళ్లిప్రయత్నాలు మొదలు పెట్టారు. అప్పుడు నా ఆలోచనలు సతీష్ పైకి పోయాయి. నాకు సతీష్‌కంటే మంచి భర్త దొరుకుతాడా? అసలు సతీష్‌కు నాపై ఎలాంటి అభిప్రాయం ఉందో?

ఓ రోజు ఇద్దరం కాలేజీ గార్డెన్‌లో కూర్చొని ఉన్నాం. చుట్టూ వాతావరణం ప్రశాంతంగా ఉంది. నా మనసులోని ఫీలింగ్ ఎలా చెప్పాలో తెలీడం లేదు. ముభావంగా కూర్చున్నాను. ఏదో చెప్పాలనుకుని చెప్పలేకపోతున్న సంగతి సతీష్ కనిపెట్టేశాడు. ఏమిటో చెప్పమని అడిగాడు.

కాసేపాగాక ''నాకు మా ఇంట్లో పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టారు'' అన్నాను మెల్లగా.

సతీష్ నా మాటలకు ఉలికిపడ్డట్టు అన్పించింది. ''అప్పుడే ఎందుకు?'' అన్నాడు.

''ఇంజనీరింగ్ అయిపోతోందిగా. పెళ్లి చేసేయాలంటున్నారు. నా తర్వాత ఇంకో చెల్లి ఉందిగా'' అన్నాను.

''నీకేమనిపిస్తోంది'' అన్నాడు.

''అన్పించడానికేముంది. ఎప్పటికయినా పెళ్లి చేసుకోక తప్పదుగా''

''అయితే చేసేసుకుంటావా?''

''ఎవరిని?''

''....''

''ఎవరిని చేసుకోమంటావు?''

''ఏమో..''

''నీలాంటి వాడుంటే చూడు'' అన్నాను.

సతీష్ మౌనంగా ఉండిపోయాడు. అతని చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. చిత్రంగా నా చేతులు వణకుతున్నాయి. గుండెలు అదురుతున్నాయి. గతంలో చాలాసార్లు ఒకరి చేతిని మరొకరు పట్టుకుని నడిచాం. కానీ ఇలా ఎప్పుడూ కాలేదు.

**''నువ్వు కావాలా'' అన్నాను ధైర్యం చేసి. నా చేయి సతీష్ చేతిలో నలిగిపోతోంది. మరో చేత్తో నన్ను దగ్గరకు లాక్కున్నాడు. ఆ స్పర్శే చెప్పింది నాపై సతీష్‌కున్న అభిప్రాయం ఏంటో.. ''నాక్కూడా నువ్వు కావాలి'' అన్నాడు ఉద్వేగంగా. ఆ క్షణంలోని ఆనందాన్ని మాటల్లో చెప్పలేను.**

''నువ్వు కావాలా'' అన్నాను ధైర్యం చేసి.

నా చేయి సతీష్ చేతిలో నలిగిపోతోంది. మరో చేత్తో నన్ను దగ్గరకు లాక్కున్నాడు. ఆ స్పర్శే చెప్పింది నాపై సతీష్‌కున్న అభిప్రాయం ఏంటో..

''నాక్కూడా నువ్వు కావాలి''అన్నాడు ఉద్వేగంగా.

ఆ క్షణంలోని ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. అది గార్డెన్, అందులో పగలు కావడంతో మాకు అంతకు మించిన దగ్గర తనం దొరకలేదు.

అప్పటినుంచీ సతీష్, నేనూ మానసికంగా భార్యాభర్తలమయిపోయాం. చదువు అయిపోగానే పెళ్లి చేసుకోవాలనుకున్నాం.

రోజులు చాలా మధురంగా నడుస్తున్నాయి. అప్పుడప్పుడు ఇద్దరి మధ్య ముద్దులు, కౌగిలింతలు నడుస్తున్నాయి. ఫైనల్ ఇయర్‌లో ఉండగానే మా కాలేజీలో క్యాంపస్ సెలక్షన్స్ జరిగాయి. మా క్లాస్‌లో ఎప్పుడూ మేమే టాప్. మా ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చాయి. చదువు అయిపోవడమే ఆలస్యం.. ఉద్యోగంలో చేరిపోవచ్చు. ఆ ఆనందాన్ని ఎలా సెలబ్రేట్ చేసుకోవడం.

ఆ రోజు ఇద్దరం శ్రీకాళహస్తికి వెళ్లాం. రాత్రి గది తీసుకుని అక్కడే ఉండిపోయాం. రాత్రి పదిగంటలయింది. వాతావరణం చలిచలిగా ఉంది. గదిలోంచి ఇద్దరం నడచుకుంటూ స్వర్ణముఖీ నది ఒడ్డున నడుస్తున్నాం. ఆలయం గోపురం మీద దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నది పరవళ్లు తొక్కుతోంది. వెన్నెల పిండారబోసినట్టుంది. ఇద్దరం నది ఒడ్డున ఒకరి నడుము చుట్టూ మరొకరి చేయి వేసుకుని నడుస్తున్నాం. మా ఇద్దరి మధ్యా మాటల్లేవు. ఉద్వేగంగా ఉంది. ఏదో అద్భుతం జరగబోతోందనే ఆనందంగా ఉంది. నడుస్తూనే ఉన్నాం. చాలా దూరం వచ్చేశాం. అక్కడికి ఆలయం మీది దీపాలు కన్పిస్తున్నాయి. మనుషులు, వాహనాల ధ్వనులు లేవు. నీటి గలగలు, మా గుండెల చప్పుడు మాత్రమే విన్పిస్తోంది. ఓ చోట కూర్చున్నాం. సతీష్ నన్ను గాఢంగా కౌగిలించుకున్నాడు. నేనతడిని తీగలా పెనవేసుకుపోయాను. మా ఇద్దరి శరీరాలు నిప్పు కణికల్లా జ్వలిస్తున్నాయి. పవిత్ర స్వర్ణముఖి నది ఒడ్డున, గంగాదేవి, శివుడి సాక్షిగా మేం ఇద్దరం ఒక్కటయ్యాం. ఆ రాత్రి అక్కడే రసాస్వాదనలో మునిగిపోయాం. ఈ అనుభవానికి, ఈ ఆనందానికి ఒక్కరేయి కాదు, ఒక్క జీవితకాలం కూడా చాలదనిపించింది. పరీక్షలు అయిపోగానే పెళ్లి చేసుకోవాలనుకుని మరోమారు గట్టిగా నిర్ణయించుకున్నాం. అక్కడినుంచి తర్వాతి రోజు తిరిగి వచ్చేశాం. సతీష్‌ను చూస్తే నాలో కోరిక బుసలు కొట్టేది. సతీష్ కూడా నన్ను చూస్తూ మునుపటిలా ఉండలేకపోయేవాడు. ఇద్దరం కాంక్షతో రగిలిపోతూ, చదువుకు దూరమౌతున్నాం అని అర్థమయింది. ఇక పరీక్షలు అయిపోయేదాకా దూరంగా ఉండాలనుకున్నాం. అలా ఉండటం కష్టమే అయినా, భవిష్యత్ జీవితాన్ని తలుచుకుని ఉండిపోయాం. పరీక్షలు అయిపోయాయి. నేను ఉద్యోగంలో చేరాను. కానీ సతీష్ చేరలేదు.

తను స్టేట్స్ వెళ్లి ఎమ్మెస్ చేస్తానన్నాడు. 'మన పెళ్లి' అన్నాను. మౌనంగా ఉండిపోయాడు. 'నీకు ఆ చదువు నాకన్నా ఎక్కువా' అనడిగాను. సతీష్‌నుంచి సమాధానం లేదు. వాళ్ల ఇంటికి వెళ్లాను. సతీష్ అమ్మగారు ''మా వాడు స్టేట్స్‌కు వెళ్లి ఎమ్మెస్ చేయాలి. వాడిని వదిలేయ్. అందులో మీ కులం వేరు మా కులం వేరు'' అన్నారు నిక్కచ్చిగా.

చాలా బాధనిపించింది. ప్రేమించడానికి లేని అడ్డంకులు ఇప్పుడు వచ్చాయా? ఒక దశలో చనిపోవాలనిపించింది. నేను ప్రేమకోసం చనిపోతే అమ్మా నాన్నా చెల్లి పరిస్థితి ఏమిటి? ఇప్పటికి నాలుగేళ్లవుతోంది. సతీష్ స్టేట్స్ వెళ్లాడు. అతనికోసం ఎదురుచూశాను. అక్కడే ఎవరినో పెళ్లి చేసుకున్నాడని తెలిసింది. ఇంకా ఎందుకు నేను నిరీక్షించడం? అయినా సతీష్‌పైనుంచి మనసు పక్కకు రావడం లేదు. నేను అతణ్ణి చాలా గాఢంగా ప్రేమించాను. కానీ అతను? అతణ్ణి నేను తప్పు పట్టడం లేదు? అతని పరిస్థితులు ఏమిటో నాకు తెలీదు? మేం గడిపిన ఆ క్షణాలు మాత్రం మధురమైనవే! ఇందులో తప్పెవరిదో ఒప్పెవరిదో నేను తర్కించదలచుకోలేదు. అయితే సతీష్‌ను నా హృదయంలోంచి చెరిపేయడానికి నా శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నాను. చెరిపేస్తాను కూడా. ఎందుకంటే మరో నెలరోజుల్లో నాకు పెళ్లి. అతడికి అతడి జీవితం అతడి కుటుంబ సభ్యులు ఎంత ముఖ్యమో, నాకూ నా జీవితం, నా కుటుంబ సభ్యులూ అంతే ముఖ్యం కదా!

☆